1
నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్ మండల కన్వీనర్ల నియామకం

నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ పార్టీ తాంసి, భీంపూర్ మండలాల కన్వీనర్‌లను నియమిస్తూ సోమవారం టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తాంసి మండల కన్వీనర్‌గా కౌడాల సంతోష్, భీంపూర్ మండల కన్వీనర్‌గా అశోక్ నియమితులయ్యారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మండల కన్వీనర్లుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శాయశక్తుల కృషి చేస్తామని పేర్కొన్నారు.



జర్నలిజంలో కళ్లెం వెన్నెలరెడ్డికి మూడో ర్యాంక్

నవతెలంగాణ-ఆదిలాబాద్

టీఎస్‌సీపీజీఈటీలో కళ్లెం వెన్నెలరెడ్డి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్లెం ప్రవీణ్‌రెడ్డి కుమార్తె వెన్నెలరెడ్డి సోమవారం విడుదలైన రాష్ట్ర పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల్లో ఎంఏ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో మూడో ర్యాంక్‌తో సత్తా చాటింది. టీఎస్‌సీపీజీఈటి-2023 ఎంఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లోనూ వెన్నెలరెడ్డి రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంక్, ఎంఏ ఎకనామిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంక్ సాధించింది. ఇలా వరుసగా ఎంట్రెన్సుల్లో వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన వెన్నెలరెడ్డిని పలువురు అభినందించారు.



అంగన్‌వాడీల సమ్మె సైరన్..!

- విధులు బహిష్కరించిన అంగన్‌వాడీలు
- జిల్లా, మండల కేంద్రాల్లో హోరెత్తిన నిరసనలు
- ప్రభుత్వం దిగొచ్చే వరకు కొనసాగిస్తామని స్పష్టీకరణ
- తాళాలు పగలకొట్టించి కేంద్రాలు తెరిపించిన అధికారులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె సైరన్ మోగించారు. స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి నిరసన బాట పట్టారు. ఇది వరకు పలుమార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఫలితంగా సోమవారం జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలతో హోరెత్తించారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి సంఘీభావం తెలిపి పోరాటానికి మద్దతుగా ఉంటామని భరోసా కల్పించారు. ఉట్నూర్‌లో సీఐటీయూ నాయకులు లంక రాఘవులు ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభించారు. మంచిర్యాల, కుమురంభీం-ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లతో పాటు మండల కేంద్రాల్లోనూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా ఐసీడీఎస్ అధికారులు స్థానికుల సాయంతో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించి కేంద్రాలను తెరిపించారు. కానీ ఒకటి, రెండు చోట్ల తప్పితే ..ఎక్కడా చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించిన దాఖలాలు కనిపించలేదు.



ఆదిలాబాద్‌లో..

పరిష్కారమయ్యే వరకు పోరాటం..!

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు చదువుతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది వరకు పలుమార్లు నిరవధిక దీక్షలు.. సమ్మెలు..జీపుజాత వంటి కార్యక్రమాలతో నిరసనలు తెలిపిన సందర్భాలున్నాయి. కానీ ప్రభుత్వం వీరి సమస్యలపై దృష్టిసారించడం లేదు. ఏండ్లు గడుస్తున్నా కనీస వేతనాలు అమలు కాకపోవడం.. ఉద్యోగ భద్రత లేకపోవడం.. ప్రమాదబీమా తదితర సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలు టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించడం వంటి డిమాండ్లతో నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు కొనసాగిస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు.



ఉట్నూర్‌లో..



అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొడుతున్న దృశ్యం

ప్రతి పౌరుడు ఓటు హక్కు కల్గి ఉండాలి : తహసీల్దార్



నవతెలంగాణ-తాండూర్

ఓటు హక్కు ప్రధానమైందని, ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ డి.రోహిత్ తెలిపారు. సోమవారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డ ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలననందించే పాలకవర్గాన్ని ఎన్నుకోవచ్చునని తెలిపారు. భారత పౌరసత్వం పొందిన ప్రతి పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత గల విద్యార్థులు ఓటు హక్కు పొందే విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓ సుమన చైతన్య, బోధన సిబ్బంది, ఆర్‌ఐ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులుగా ఆరెల్లి మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులుగా ఆరెల్లి మల్లేష్‌ను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ప్రకటించింది. సోమవారం అంబేద్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ హాజరయ్యారు. అందరి సమక్షంలో ఎమ్మార్పీఎస్‌లో 15సంవత్సరాల నుండి కార్యకర్తగా, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులుగా, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన మల్లేష్‌ను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల పంపిణీ అందరికీ సమానంగా జరగాలని 29 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటంలో భాగస్వామ్యమైనందుకు గర్విస్తున్నానని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా అందరిని సమన్వయం చేసుకుంటూ బాధ్యత నెరవేరుస్తానని పేర్కొన్నారు. తనకు జిల్లా బాధ్యతలు అప్పజెప్పినందుకు మందకృష్ణ మాదిగకు, రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్‌కు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పులి సంచారం వదంతులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పీచర గ్రామంలో పులి సంచరిస్తోందని వదంతులు వ్యాపించాయి. విషయం తెలిసిన వెంటనే బీట్ అధికారి రమేష్, అధికారులు సంజీవ్ చేరుకొని పరిశీలించారు. పులి ఆనవాళ్లు కావని, తోడేలు పాదముద్రలుగా గుర్తించారు. ప్రజలెవరూ భయభ్రాంతులకు గురి కావద్దని, పుకార్లు నమ్మవద్దని సూచించారు.

చదవడం విద్యార్థులకు నిత్యకృత్యం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండి చదవడం నిత్యకృత్యం చేయాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో 15 మండలాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు అమలులో 'పఠనం' చాలా ముఖ్యమైనదని, రూం టు రీడ్ అందించినటువంటి గ్రంథాలయ పుస్తకాలను కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వినియోగించుకోవాలని తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను మానిటరింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా ధారాళంగా చదవడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం వంటి అంశాల మీద దృష్టి సారించాలని సూచించారు. గ్రంథాలయ పుస్తకాల బ్యాగులను రొటేషన్ పద్ధతిలో ప్రతి పాఠశాలకు షిఫ్ట్ చేయాలని, చెక్ అవుట్ చెక్ ఇన్ రిజిస్టర్స్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూమ్ టు రీడ్ పర్యవేక్షకురాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివేకానంద చౌక్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా(తారిక్) మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో భాగంగా 76 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుల్లూరి శంకర్, డైరెక్టర్ నాంపల్లి శంకర్, జెడ్సీ కోట వెంకన్న పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికారం కోసం అందరూ ఉద్యమించాలి

- మంచిర్యాలలో రాజ్యాధికార దీక్షా దివస్

నవతెలంగాణ-హాజీపూర్

బీసీ రాజ్యాధికారాన్ని, ఆత్మాభిమానాన్ని నిలబెట్టుకునే దిశలో బీసీ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని వివిధ బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బీసీ రాజ్యాధికార దీక్షా దివస్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థాయిలో టికెట్లు ఇవ్వాలని వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు బీసీ ఎమ్మెల్యేనే గెలిపించుకునే దిశలో చైతన్యవంతులు కావాలని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి దొరల నుండి స్వాతంత్రం రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. బహుజన చైతన్యం గల బీసీ బిడ్డల ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం దక్కుతుందని తెలిపారు. పూలే, అంబేద్కర్ అందించిన స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ముఖేష్‌గౌడ్, బీసీ ఐక్య వేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సంఘాల నాయకులు కర్రె లచ్చన్న, కైరం జనార్ధన్, డాక్టర్ రమణ, నీలి శ్రీనివాస్, చంద్రమౌళిగౌడ్, నీలకంఠేశ్వరరావు, డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, బియ్యాల సత్తయ్య, తులా మధుసూదన్, నల్లా నాగేంద్ర ప్రసాద్, నరెడ్ల శ్రీనివాస్, సదానందం, మాడిశెట్టి విశ్వం పాల్గొన్నారు. వివిధ రాజకీయ, కుల సంఘాల నాయకులు దీక్ష దివస్‌కు సంఘీభావంగా సభలో పాల్గొన్నారు.



22వ ఏరియా లెవెల్ త్రైపాక్షిక రక్షణ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

22వ ఏరియా లెవెల్ త్రైపాక్షిక రక్షణ సమీక్షా సమావేశం సోమవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లోని సమావేశ మందిరంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైండ్స్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ హైదరాబాద్ భూషణ్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమీక్ష సమావేశానికి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మైనింగ్) నాగేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(ఎలక్ట్రికల్) బెహరా, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మెకానికల్)ఎం. అరుముగం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మైనింగ్)బానోత్ వెంకన్న, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్)రాజీవ్ ఓం ప్రకాష్, ఇన్స్పెక్టర్ ఆఫ్ మైన్స్ ఓ హెచ్ జార్జ్ జాన్, సేఫ్టీ జనరల్ మేనేజర్ కార్పోరేట్ సుభాని, జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, సేఫ్టీ జనరల్ మేనేజర్ బెల్లంపల్లి రీజియన్ కేహెచ్‌ఎన్ గుప్తా పాల్గొన్నారు. సమీక్ష సమావేశానికి ముందు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్ ప్రసాద్‌సింగ్ మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో సింగరేణి చర్యలు బాగున్నాయని తెలియజేశారు. రక్షణ ప్రతిజ్ఞతో సమావేశాన్ని ప్రారంభించారు. అలాగే గని ప్రమాదాలలో మరణించిన ఉద్యోగులకు, అధికారులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్ ప్రసాద్ సింగ్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సేఫ్టీ సుభాని మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలను తెలిసి ఉండి వారి వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతో పనిచేయాలని, శ్రీరాంపూర్ ఏరియాలో ప్రమాదాలను కూడా జీరో పర్సెంట్ సాధించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని చెప్పారు. ఈ విషయంపై సమీక్ష సమావేశానికి హాజరైన యూనియన్ నాయకులు, అధికారులు శ్రీరాంపూర్ యాజమాన్యాన్ని శ్రీరాంపూర్ ఏరియాలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించి తగిన సలహాలు సూచనలు చేశారు. ఉపరితల, భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరగకుండా నివారించడానికి కావలసిన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటూ నిష్ణాతులైన ఉద్యోగులను సునిశితమైన ప్రదేశాలలో పనికి నియమించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గనులలో రక్షణ ఏర్పాట్లపై డీజీఎంఎస్ అధికారులకు వివరించారు.



ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ క్యాంపస్‌లో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు పురుషుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు శిక్షణలో భాగంగా డ్రైవాల్, ఫాల్సిలింగ్, హోటల్ మేనేజ్మెంట్, ఎలక్ట్రిషన్, ఎయిర్ కండిషన్, బైక్ మెకానిక్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అమ్మాయిలకు నాగారం, సిరిసిల్ల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9959280252, 8919890976 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ సవరించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ సవరించాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రావి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 5089 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. సీఎం అసెంబ్లీలో ప్రకటించినట్టుగా 13,086 పోస్టులతో పాటు ప్రమోషన్స్, బదిలీల ద్వారా ఏర్పడిన ఖాళీలు కలిపి భర్తీ చేయాలని కోరారు. 317 జీవోను రద్దు చేయాలని, వాటి ద్వారా ఏర్పడిన ఖాళీలు డీఎస్సీ పోస్టుల్లో కలపాలన్నారు. డీఎస్సీ పరీక్షకు నాలుగు నెలల సమయం కేటాయించాలని, పరీక్ష ఫీజును రూ.200గా నిర్ణయించాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు 7సంవత్సరాలుగా ఉపాధ్యాయ నియామకం కోసం చేపట్టే డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఈ నోటిఫికేషన్ వల్ల చాలా జిల్లాల్లో పోస్టులు లేక విద్యార్థులు నిరాశకు లోనవుతున్నారని వాపోయారు. 317 జీవో రద్దు చేస్తే 600పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఏర్పడే అవకాశం ఉందని, ప్రమోషన్స్, బదిలీలు ద్వారా మరికొన్ని పోస్టులు పెరుగుతాయన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని డీఎస్సీ నోటిఫికేషన్ సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి వెంకటేశ్, అభ్యర్థులు పాండు, రాజ్‌కుమార్, సందీప్, సంజీవ్, శ్రీసాయిరాం పాల్గొన్నారు.

టెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 15న జిల్లాలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం టెట్ నిర్వహణపై ఆర్డీఓ సురేష్, జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి చీఫ్ సూపరింటెండెంట్ అధికారులు, రూట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఏర్పాట్లను ముందు రోజే పరిశీలించాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని, ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, దివ్యాంగ అభ్యర్థుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాల తరలింపును ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పూర్తిస్థాయి బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ ఏర్పాట్లతో పాటు వైద్య సిబ్బందిని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, ప్రతి గదికి 24 మంది అభ్యర్థులు ఉండేలా కార్యచరణ రూపొందించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలలో పేపర్ 1 కొరకు 21 పరీక్ష కేంద్రాలు, పేపర్ 2 కొరకు 10 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమీక్షలో పరీక్షల కో-ఆర్డినేటర్ ఉదయ్‌బాబు, చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను రెగ్యులర్ చేయాలని రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ అవుట్ పేషెంట్ బ్లాక్ ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు ఆత్మగౌరవంగా బతికే విధంగా, ఏ ఒక్క అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి కూడా అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం హోంగార్డ్ ఉద్యోగి రవీందర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రవి, సారయ్య, సకావత్, నీలిమ, జ్యోతి, మమత, సంతోష్, అనిల్, జ్ఞానేశ్వర్, రవికిరణ్ యాదవ్, శైలేందర్, చంద్రశేఖర్‌గౌడ్, అల్తామస్ సుల్తాన్, అన్వేష్, నాయదలిఖాన్, దినేష్, చంద్రసింగ్ పాల్గొన్నారు.

హత్య నిందితుడి అరెస్టు


వాంకిడి : మండలంలోని వెల్గీ గ్రామానికి చెందిన సోయం భరత్‌ను హత్య చేసిన పర్చెటి రాంషావ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భరత్(23)కు అదే గ్రామానికి చెందిన పర్చెటి రాంషావ్ మధ్య గొడవ జరగడంతో క్షణికావేశంలో భరత్‌ను కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. రక్తం మడుగులో పడి ఉన్న భరత్‌ను భార్య సోయం చంద్రకళ కుటుంబసభ్యుల సాయంతో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రకళ ఫిర్యాదు మేరకు రాంషావ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

14న ప్రజావేదిక

సిర్పూర్(టి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 12వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక 14న ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఏపీఓ రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2011 నుండి 2023 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో ఈ నెల 3 నుండి 13 వరకు తనిఖీ చేపడుతుందన్నారు.

కడెం ప్రాజెక్టుకు చేరుతున్న వరద నీరు

నవతెలంగాణ-కడెం



కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు, 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 697.150 అడుగులు, 6.880 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లోగా ప్రాజెక్ట్‌లోకి 2558 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది ఆయకట్టు పంటల సాగుకు కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా 853 క్యూసెక్కుల నీటిని సాగుకు అధికారులు విడుదల చేస్తున్నారు.

అమరుల ఆశయాలను కొనసాగించాలి

- డీఎఫ్‌ఓ రామకృష్ణన్ యాదవ్

నవతెలంగాణ-సారంగాపూర్

అమరుల ఆశయాలను కొనసాగించాలని డీఎఫ్‌ఓ రామకృష్ణన్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని చించోలి(బి) పార్క్‌లో అటవీ అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీసీఎఫ్ బాసర సర్కిల్ శర్వానన్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ రామకృష్ణన్ యాదవ్ మాట్లాడుతూ విధినిర్వహణలో అమరులైన అటవీ సైనికులను త్యాగాలను కొనియాడారు. అటవీ సంపదను రక్షించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అటవీ శాఖ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు.



సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల సమ్మె



నవతెలంగాణ-సారంగాపూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, ఆయలు సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మండల అధ్యక్షులు భాగ్యలక్ష్మీ మాట్లాడారు. అంగన్‌వాడీ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అంగన్‌వాడీకు రూ.10 లక్షలు, మినీ టీచర్లకు రూ.5లక్షల బెనిఫిట్స్ అందజేయాలని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పర్మినెంట్ చేసి నెలకు రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను టీచర్ అకౌంట్‌లోనె వేయాలన్నారు. వేసవి సెలవులు పాఠశాల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 68 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆలయాలు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న సమ్మె సోమవారం ప్రారంభమైంది. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండలానికి చెందిన అన్ని గ్రామాల అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం నిరవధిక సమ్మెకు దిగారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు లేబర్ యాక్ట్ ప్రకారం నెల రోజుల ముందే ఐసీడీఎస్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లతో ఎలాంటి చర్చలు నిర్వహించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నియంతృత్వంగా సమ్మెకు దిగిన అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి వారి స్థానంలో ఐకేపీ వీఓఏలకు, పంచాయతీ సెక్రటరీలకు అంగన్‌వాడీ సెంటర్లను అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగులు ఎవరి పని వారే చేయాలి కాని, రాజ్యాంగం నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని అన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలని కోరారు. వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయిచాలని, 60 సంవత్సరాల దాటిన అంగన్‌వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్‌మెంట్ కోరితే తగిన బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలని, సమ్మె నోటీసులోని డిమాండ్లన్నీ పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షులు ఎ.రాజమణి, జిల్లా కార్యదర్శి బి.లలిత, ఉపాధ్యక్షులు కే.విజయ, మండల నాయకులు హేమలత, డి.విజయ లక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

తాంసి : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయ అవరణల్లో అంగన్‌వాడీ ఉద్యోగులు సీఐటీయూ అధ్వర్యంలో నిరవధిక సమ్మె చేస్తున్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ గత ఏన్నో సంవత్సరాలుగా చాలీచాలని, వేతనాలతో అంగన్‌వాడీ ఉద్యోగాలుగా చేస్తున్నాము. తెలంగాణ రాష్ట్రం సాధనకు మేము కూడా ఉద్యమంలో పాల్గొన్నామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు గడిచిన మా గురించి ఆలోచించక పోవడం సిగ్గు చేటని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మా వేతనాలు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. అంగన్‌వాడీ సమస్యలు పూర్తి స్థాయిలో ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మీరాబాయి, మంగళ విఠబాయి, గంగుబాయి, విజయ, భాగీరథ, సరిత, ప్రియా, సుజాత ఉన్నారు.



అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపు ధోరణులు మానుకోవాలి

- సెంటర్ తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి సామరస్య పూర్వకంగా విజ్ఞప్తి చేసిన పట్టించుకోకపోవడంతో అంగన్‌వాడీలు సమ్మెకు వెళ్లారని, సంఘాలను పిలిచి చర్చలు జరిపి సామరస్యంగా, సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం బెదిరింపులకు దిగుతూ, సెంటర్‌ల తాళాలు పగలగొట్టి వారినీ భయభ్రాంతులకు గురిచేయడాన్ని సమాజం అంగీకరించదని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాళాలు పగల గొట్టినవారు గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు వండిపెట్టారా అంటే ఆ పని చేయలేదని, అందులో ఉన్న సామాగ్రి ఎవరైనా దొంగిలిస్తే పగులగొట్టిన వారు బాధ్యత వహిస్తారా అని పేర్కొన్నారు. తల్లుల మీద పిల్లల మీద ప్రేమ ఉంటే ఎందుకు వండి పెట్టలేదని ప్రశ్నించారు. ఇది కేవలం కక్ష సాధింపు తప్పా మరొక్కటి తెలియజేశారు. ఈ చర్యలను పార్టీ ఆదిలాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. తాళాలు పగల గొట్టి దౌర్జన్యానికి దిగిన వారిపైన చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే జోక్యం చేసుకొని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం మీద కించపరిచే వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని వినాయక చౌక్‌లో ఉదయనిధి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి మాట్లాడారు. తమిళనాడులో ఏవిధంగానైతే హిందువులపై అణిచివేతకు గురి అవుతున్నారో ఆదేవిధంగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా హిందువులపై దాడులు జరిగిన ఏలాంటి స్పందన ఉండకపోవడం చాలా బాధాకరమన్నారు. కేవలం ఓట్ల కోసమే మాత్రమే హిందువులను వాడుకొని తరువాత పట్టనట్టు వ్యవహరించడం బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న వ్యవహారమని అన్నారు. దేశం మొత్తం సనాతన ధర్మం మీద విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్న ఉదయనిధి మారన్ స్టాలిన్‌కి వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతే తెలంగాణ సీఎం ఎందుకు ఖండించడం లేదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లాలా మున్న, జోగు రవి, సోమ రవి, మహేందర్, రఘుపతి, దినేష్ మటోలియ, మయూరి చంద్ర, ఆకుల ప్రవీణ్, భీమ్‌సేన్‌రెడ్డి, శివ, రవిరెడ్డి, ముకుంద్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలు విజయవంతం చేయాలి

- టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు



నవతెలంగాణ-ఉట్నూర్, ఇంద్రవెల్లి

ఈనెల 19నుంచి 21 వరకు తమిళనాడు రాష్ట్రంలోని నామక్కాల్ పట్టణంలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలనీ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు పిలుపునిచ్చారు. సోమవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి 1100 మంది ప్రతినిధులు, జాతీయ రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని అన్నారు. మహా సభల్లో ఆదివాసీల సమస్యలు అటవీ హక్కుల చట్టం అమలు, రాజ్యాంగం కల్పించిన ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు గురించి చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. ఈ మహాసభలకు 5 గురు ఎంపిక అయ్యారని అన్నారు. జిల్లాలోని ఆదివాసుల సమస్యలు మహాసభల్లో ప్రస్తావిస్తమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు కొరెంగ జంగు, చిత్రం వికాస్, పెందోర్ కృష్ణ జైతు, గణేష్ ఉన్నారు.

సమగ్ర ఉద్యోగుల జాగరణ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారంతో ఈ సమ్మె 11 రోజుకు చేరుకుంది. రోజుకో రీతిలో వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఒంటికాలుపై నిలబడి, రాత్రి జాగరణ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ మినిమం టైం పేస్కేల్ కల్పించాలని కోరారు. పది లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధశాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్రశిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా దీక్ష శిబిరానికి సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు బండి దత్తాత్రి సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పడాల రవీందర్, అనురాధ, దీప్తి, ప్రశాంత్ రెడ్డి, ప్రకాష్, పార్థసారథి, ధర్మసింగ్ పాల్గొన్నారు.

షీ ఈజ్ చేంజ్ మేకర్ ఫర్ ఉమెన్ సదస్సుకు ఎంపికైన సర్పంచులు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పట్నాపూర్, మండబోగడ, గ్రామపంచాయతీ సర్పంచులు పంద్రం సుగుణ, ఆడే జంగుబాయిలు షీ ఈజ్ చేంజ్ మేకర్ ఫర్ ఉమెన్ సదస్సుకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 12, 13, 14, మూడురోజుల పాటు హైదరాబాద్ కేంద్రంగా జాతీయ మహిళా కమిషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ సంయుక్తంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో మార్పు కోసం మహిళా అట్టడుగు స్థాయి మహిళాల రాజకీయ నాయకుల నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించిన మండల జిల్లాస్థాయి అధికారులకు సర్పంచ్‌లు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతకు సోమవారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న 17వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యురాలు గండ్రత్ సుజాతకు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి కోవిడ్‌లో సహితం మా ప్రాణాలను లెక్క చేయకుండా యావత్ ప్రపంచం ప్రశంసించిన, మా వైద్యారోగ్యశాఖలో పదిహేను సంవత్సరాల నుంచి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలుగా పని చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని 17వేల మంది ఉద్యోగులను ఆఫీస్ బాయ్ నుంచి ఆఫీసర్ వరకు పారామెడికల్ నాన్ పారామెడికల్, కౌన్సిల్, ఇలా చాలావరకు అర్హతలు ఉండి ఏమర్జెన్సీ సర్వీస్‌తో పాటు తెలంగాణ వైద్యారోగ్య శాఖలో ప్రవేశపెట్టె ప్రతి హెల్త్ ప్రోగ్రామ్‌లలో ప్రకృతి విపత్తులో పల్లె, బస్తి దావఖాన, టీబీ, ఎన్‌సీడీ, టీ హబ్, ఆర్‌బీఎస్‌కే, డీఈఐసీ, మలేరియా తదితర సేవలు అందిస్తున్న ప్రభుత్వం మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించక పోవడం బాధాకరమని అన్నారు. దీనికి స్పందించిన గండ్రత్ సుజాత ఉద్యోగులతో మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మీరు అందించిన సేవలు మర్చిపోలేనివి అని తప్పకుండా పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఎన్ హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల గురించి ఉండేలా తన వంతు కృషి చేస్తాననీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దొంతుల ప్రవీణ్, ఉపాధ్యక్షులు కార్యదర్శి గితేష్, డీపీఎంయు రమణ, ఐడీఎస్‌పీ శివ, ప్రమోద్, మలేరియా అనిల్, ప్రశాంత్, జక్కి నవీన్, గోపాల్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-కడెం

వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న అన్నారు. సోమవారం దోమతెరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ ఉండకూడదని, డ్రైనేజీల్లో, రోడ్లపై చెత్త వేయద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కడెం ప్రభుత్వాస్పత్రి సూపర్‌వైజర్ గోపాల్, కార్యదర్శి రమాదేవి, కారోబారి మహేందర్, గ్రామస్తులు వెంకటేష్, రామన్న, దేవులిబాయి పాల్గొన్నారు.

పాపహరేశ్వర ఆలయానికి మహా పాదయాత్ర

నవతెలంగాణ-దిలావర్‌పూర్



లక్కిడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ సాయి సేవా సమితి సభ్యులు నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని కదిలి పాపహరేశ్వర ఆలయానికి సోమవారం భారీ ఎత్తున పాదయాత్రను చేపట్టారు. సాయినాథుని భక్తులు చేతిలో జెండాలు పట్టుకుని, సాయి పారాయన గీతాల డీజే చప్పులతో పాదయాత్రగా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడం చూపరులను ఆకట్టుకుంటుంది. పాపహరేశ్వర ఆలయానికి చేరుకున్న తర్వాత శివలింగానికి పూజలు చేసి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాదయాత్ర చేస్తే ఎంత దూరమైనా కాలినడకన చేరుకోవచ్చునని, పాదయాత్రలో సాయి నామస్మరణ చేస్తూ సునాయాసంగా గమ్యాన్ని చేరుకున్నామని సాయి సేవా సమితి భక్తులు అన్నారు.

మైసమ్మ ఆలయానికి భూమిపూజ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాయినగర్ దళిత కాలనీలోని మైసమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సర్పంచ్ సురేందర్ యాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాలనీలోని తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. అన్ని వర్గాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఆయన అన్నారు. గత పాలకులు చేసిన నిర్లక్ష్యం కారణంగా సాయినగర్ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నిధులను కేటాయించడమే కాకుండా ఎమ్మెల్యే నిధులతో పాటు ప్రత్యేక నిధులు తీసుకువచ్చి సాయినగర్ కాలనీలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన క్షణాల్లో ముందుంటానని హామీ ఇచ్చారు. త్వరలో ఎంత ఖర్చు అయిన ఎస్సీ కాలనీలో మైసమ్మతల్లి ఆలయం నిర్మాణం పూర్తి చేపడుతానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.లక్ష్మణ్, పద్మారావు, స్వామి, ప్రకాష్, రాకేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి రోడ్డు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇచ్చోడ చుట్టుపక్కల ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ఇచ్చోడ టౌన్ రోడ్డు కొరకు నిధులు కేటాయించిన సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు బోథ్ నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ శిరీష్‌రెడ్డి, ఎంపీపీ ప్రీతంరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముండే పాండురంగ్, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ మండల కన్వీనర్ మేరజ్, అజీమ్, కలిమ్ అధికారులు మండల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డాక్టర్ భీంరావు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి భీమ్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని వర్తమన్నూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, దగ్గు, జలుబుతో పాటు గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు జ్వరాలు ప్రభలే అవకాశం అధికంగా ఉంటుందని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ (హెచ్‌సీఓ) పండుగు ప్రశాంత్, హెల్త్ సూపర్‌వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం సంగీత, పంచాయతీ కార్యదర్శి ప్రణతి, గ్రామస్తులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గొర్రె మృత్యువాత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో భూషణం ప్రభాకర్ అనే రైతుకు చెందిన గొర్రె సోమవారం విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...రోజులాగే మేతకు వెళ్లిన గొర్రె, ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లి విద్యుద్ఘాతానికి గురైందని, గొర్రె విలువ దాదాపు రూ.10వేల వరకు ఉంటుందని తెలిపారు. బాధితుడిని విద్యుత్‌శాఖ అధికారులు ఆదుకోవాలని కోరారు.

ప్రజల్లోకి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లు

నవతెలంగాణ-కడెం

మండలంలోని ప్రజల్లోకి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్ ప్రజలకు వివరించారు. సోమవారం మండలంలోని గంగాపూర్ తండ, రాణిగూడ గ్రామపంచాయతీలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు తీరుతాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ డిక్లేషన్ గురించి ఆయా గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రమేష్, జక్కుల శీను, రెంకల శీను, గుండువేలు లచ్చన్న, దుద్‌రాం నాయక్, దుందిరావ్ శ్యాం పటేల్, సాయికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవుతున్నట్టు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

ఖైరిగూడ ఓసీని సందర్శించిన మార్కెటింగ్ జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



ఖైరిగూడ ఓసీని మార్కెటింగ్ జీఎం దేవేందర్ సందర్శించారు. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, డిస్పాచ్‌పై సమీక్షించారు. మొదటిసారిగా బెల్లంపల్లి ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆయనను ఖైరిగూడ ఓసీ అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పీఓ ఎన్ సత్యనారాయణ, ఖైరిగూడ మేనేజర్ ప్రవీన్‌పాంటింగ్, ఎస్‌ఓ రాజేశ్వర్‌రావు, డీవైఎస్‌ఎస్‌ఓ(సర్వే ఆఫీసర్) కె రామాచారి, డీవైపీఎం ఎన్.వేణు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-సిర్పూర్(టి)



అధికారులు, సభ్యులు హాజరుకాకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. అధికారులు, సభ్యులు సమావేశానికి హాజరుకాకపోవడంతో ఎంపీపీ చునార్కర్ సువర్ణ ఆగ్రహం వ్యక్తి చేశారు. సమావేశాన్ని వాయిదా వేయాలని ఎంపీడీఓ రాజేశ్వర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు 34 మంది హాజరుకావాల్సి ఉండగా కేవలం 10 మంది మాత్రమే హాజరుకాగా 16 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ఏ ఒక్కరు కూడా హాజరుకాలేదని తెలిపారు. ఏడుగురు ఎంపీటీసీలకు ఐదుగురు మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు. సమావేశానికి పూర్తిస్థాయి సభ్యులు, అధికారులు హాజరుకాకుంటే అభివృద్ధి పనులు ఏ విధంగా జరుగుతాయని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెడికల్ కళాశాలతో మెరుగైన వైద్య సేవలు

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్‌లో ఈ నెల 15న ప్రారంభించనున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ల్యాబ్‌లు, స్టాఫ్, తరగతి గదులు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైందన్నారు. ఆదివాసీ జిల్లాలో ఇది మరో చరిత్రఅని కొనియాడారు. రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధికి మెడికల్ కళాశాల ముఖ్య భూమిక పోషించనుందన్నారు. ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, కుమురంభీం మనుమడు కుమురం సోనేరావు, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-బెజ్జూర్



మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏఎస్సై మోహన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి నవీద్ హైమద్ ఖాన్, బెజ్జూర్ పీహెచ్‌సీ డాక్టర్లు అవినాష్, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్‌కుమార్, ఆర్‌ఎంపీ అధ్యక్షుడు ఇబ్రహీం పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- ప్రారంభమైన అంగన్వాడీల సమ్మె
- కొనసాగుతున్న ఆందోళనలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కలెక్టర్ కార్యాలయం సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. డిమాండ్లు పరిష్కరించాలని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ధర్నాలు చేయడంతో కలెక్టరేట్ ఎదుట నిరసనకారులతో రద్దీ ఏర్పాడింది. కార్మికుల ధర్నాలకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి నిరసన కారులు అధిక సంఖ్యలో రావడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పలువురు కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో ధర్నాల పరంపర కొనసాగుతోంది.

ప్రారంభమైన అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె

అంగన్వాడీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చూస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆగస్టు 18న అంగన్వాడీలకు మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. మంత్రి హామీకి భిన్నంగా రిటైర్మెంట్ బెన్ ఫిట్స్ తగ్గించడం అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష హెల్పర్లకు రూ.50,000 ప్రకటించడం దారుణం అన్నారు. మిగిలిన వేతనాల పెంపు ఇతర అంశాలు పరిష్కారం చేయలేదన్నారు. పైగా బెదిరింపులకు పాల్పడడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత, వనిత, సూర్యమణి పాల్గొన్నారు.



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు ట్రస్మా మద్దతు

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న 15వ రోజు రిలే నిరాహార దీక్షలకు ప్రయివేట్ పాఠశాలల యజమానుల సంఘం (ట్రస్మా) మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావ్, జిల్లా నాయకులు దేవభూషణం, రాధాకృష్ణ చారి, నరేందర్, కిరణ్, రాజేంద్రప్రసాద్, జితేష్, తాజుద్దీన్, వసీం మద్దతిచ్చిన వారిలో ఉన్నారు. రిలే నిరాహార దీక్షలలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు దుర్గం సందీప్, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, ఐఈఆర్పి అధ్యక్షులు స్రవంతి, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు.

కొనసాగుతున్న భగీరథ కార్మికుల సమ్మె

తమ డిమాండ్లు పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికులు చేస్తున్న సమ్మె 10వ రోజు కలక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లూరి లోకేష్, లింగయ్యలు మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి సమ్మె విరమించేలా చూడాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి యాజమాన్యాలు బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎవరెస్టు కంపెనీ కార్మికులు ప్రేమదాస్, రాజు, గోకుల్, గౌతం, ప్రకాష్, వినోద్, యోగి, బాలేష్, లింగయ్య, వెంకటేష్, హరీష్, సందీప్, అంజి, ప్రవీణ్, దయానంద్, జైపాల్, సురేష్, భాస్కర్, గౌతం, బిట్టు, రవి, వేణు, కుమార్, చందు పాల్గొన్నారు.

మోకాళ్లపై ఎన్‌హెచ్‌ఎం కార్మికుల నిరసన

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని చేస్తున్న సమ్మెలో భాగంగా 13వ రోజు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అధికారులు ఎన్‌హెచ్‌ఎం కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నారని ప్రభుత్వం అధికారులు స్పందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు శంకర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిపెల్లి మధుకర్, నాయకులు సధాలక్ష్మి, కౌన్సిలర్ సదానందం, డీఈఓలు సాయి, షకీల్, శ్రీదేవి, మమత, రజిత, బ్లాక్ లెవల్ అకౌంటెంట్ వెంకటేష్, ఫార్మసిస్ట్ సాయికృష్ణ, సంగీత, అనూష, స్టాఫ్‌నర్స్ కాశికమల, విజయ, సాయిలత, చామంతి, సునీత, సంభోది, ధనలక్ష్మి కాంటినెంట్ వర్కర్ ముస్తాక్, సంగీత, మానుకు భాయ్, లింగవ్వ పాల్గొన్నారు.







యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా

- జోరుగా సాగుతున్న అక్రమ రవాణ
- లబ్దిదారుల వద్ద కొనుగోలు చేస్తున్న డీలర్లు
- పర్యవేక్షణ లోపంతోనే అక్రమాలు
- మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం

నవతెలంగాణ-దహెగాం

పేద ప్రజల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం అక్రమార్కులకు వ్యాపారంగామారి లాభాలు తెచ్చిపెడుతోంది. టన్నుల కొద్దీ రేషన్‌బియ్యం అధికారుల కండ్లు కప్పి రాష్ట్రాన్ని దాటిస్తున్నారు. కుమురంభీం జిల్లాలో నిత్యం రేషన్‌బియ్యం అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది. దొరికితేనే దొంగ అన్న చందంగా అక్రమ బియ్యం రవాణా చేస్తూ ఏకంగా రాష్ట్రాన్నే దాటిస్తున్నా అధికారులు మాత్రం మామూలుగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా గుప్పుమంటున్నాయి. కేవలం సమాచారం ఇస్తేనే తప్పా పకడ్బందీ చర్యలు తీసుకొని తనిఖీలు చేసిన దాఖలాలు లేవనేవి బహిరంగ రహస్యం. దీంతో పేదల కడుపునింపాల్సిన రేషన్‌బియ్యం అక్రమ దందాగా మారి అక్రమార్కుల జేబులు నింపుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 80 శాతం మంది రేషన్‌బియ్యం తింటుండగా పట్టణాల్లో మాత్రం 60 శాతం మంది మాత్రమే తినడానికి వినియోగిస్తున్నారనేది ప్రాథమిక అంచనా. మిగిలిన వారిలో కొందరు రేషన్ డీలర్లకే విక్రయిస్తుండగా మరికొందరు ఇంటికి తీసుకెళ్లి బయటి వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలు చేసిన బియ్యాన్ని అక్రమార్కులు రాత్రి వేళల్లో జిల్లాకు ఆనుకొని ఉన్న ప్రక్క రాష్ట్రం మహారాష్ట్రకు రాత్రి వేళల్లో సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ రవాణాకు అడ్డాగా పలు మండలాలు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాలు మహారాష్ట్ర సరిహద్దులుగా ఉండడం అక్రమ మార్కుల పాలిట వరంగా మారింది. నిత్యం పగటి వేళల్లో గ్రామాల్లో లబ్దిదారుల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని తమకు అనుకూలమైన ప్రదేశాల్లో నిల్వ చేయడం, అనంతరం వాటిని రాత్రి వేళల్లో బొలేరోలు, ఐచర్ వ్యాన్‌లు, లారీల్లో నింపి సిర్పూర్(టి) రహదారి మీదుగా చింతలమానెపెల్లి మండలం గూడెం రహదారి మీదుగా, వాంకిడి ప్రధాన రోడ్డు గుండా రాత్రి వేళల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సిర్పూర్(టి), వాంకిడి మండలకేంద్రాల వద్ద పోలీసు తనిఖీల్లో నిత్యం వందలాది క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుబడుతున్నా రేషన్ దందా ఆగడంలేదంటే వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



సమాచారం అందితేనే దాడులు

రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ చేసి తరలిస్తున్నారనే సమాచారం ఎవరి ద్వారానైనా అందితే తప్ప అధికారులు ప్రత్యేకంగా నిగా పెట్టిన సందర్భాలు లేవనే చెప్పాలి. దుకాణాల్లో నిల్వలు, రికార్డులు, ధరల పట్టిక, తూకంలో మోసాలను తరుచూ పరిశీలించాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఇవేవి పట్టించుకోకుండా మామూలుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం రేషన్ డీలర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు చెప్పడం వరకే సరిపెడుతున్నారు. చాలాచోట్ల రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు డీలర్లే కొనుగోలు చేసి వ్యాపారులకు అమ్ముతున్నారనే అభియోగాలు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. తెలంగాణలో ఉచితంగా లభిస్తున్న రేషన్‌బియ్యానికి మహారాష్ట్రలో మంచి ధర పలకడంతో చాలామంది డీలర్లు అక్రమార్కులతో కుమ్మక్కై వ్యాపారానికి సహకరిస్తుండడంతో యెదెచ్ఛ అక్రమ దందా సాగిస్తున్నారు. ఇటీవల సిర్పూర్ వద్ద లారీలో తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకోగా నేడు జైనూర్‌లోనూ కిరాణషాపులో నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న సందర్భాలను చూస్తుంటే నిత్యం ఏదో ఒకచోట దందా కొనసాగుతోందని స్పష్టమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక నిగా పెడితే తప్పా రేషన్ దందాకు అడ్డుకట్ట వేయలేమని ప్రజలు అంటున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-దహెగాం



సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) జిల్లా నాయకురాలు వజ్రమ్మ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.ఐదు లక్షలు తప్పనిసరిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన అంగన్‌వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కోరితే బెన్‌ఫిట్స్ కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు జయతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు విజయలక్ష్మి, కల్పన, పార్వతి, పద్మ రాజేశ్వరి, గౌసియా పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టారు. సోమవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసి మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, రమాశ్రీ, శారద పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ అందించాలని, అంగన్‌వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కోరితే బెన్‌ఫిట్స్ కల్పించాలని, ప్రమాదబీమా రూ.ఐదు లక్షల చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, శ్రీలత, పద్మ రాజేశ్వరి, రాజమణి, అబ్దుల్ ఉన్నీస, సుమిత్ర, భూలక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

కెరమెరి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీల సమస్యలపై మంత్రి నాయకులతో చర్చలు జరిపి హామీలు ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. మంత్రి ఇచ్చిన హామీలకు భిన్నంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ సగం తగ్గించి, టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేలు ప్రకటించి, మిగిలిన వేతనాల పెంపు ఇతర అంశాలు పరిష్కారం చేయలేదన్నారు. ప్రభుత్వమే చర్చలకు పిలిచి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు అనసూయ, మంజుల, సావిత్రి, సరోజ, లింగుబాయి, జానబాయి పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సోమవారం నుంచి నిరావధిక సమ్మె చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ముందు బయిటయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేవాలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని కాప్రి గ్రామంలో నూతన హనుమాన్ ఆలయం ప్రారంభోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.5లక్షలతో ఆలయంలో షెడ్డు నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచ్ కొట్నాక గిరిజ, తీర్థన్‌రావు, ఎంపీటీసీ సత్రవేణి మల్లేష్, సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, ఆత్రం జలింషా, బాబురావు, బలరాం, మాజీ సర్పంచ్ సత్తన్న పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో అటవీ సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు అటవీ శాఖ సిబ్బంది ఘన నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రమాదేవి, సెక్షన్ అధికారి జగన్మోహన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా కార్యాలయ ఆవరణలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ స్మరణార్థం ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అటవీ అధికారులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా కలప స్మగ్లర్లు, తీవ్రవాదులతో పోరాటం చేసి, వారు చేసిన దాడులలో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అటవీశాఖ అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి సేవలను గుర్తు చేశారు. ఇప్పటివరకు 3 దశాబ్దాలలో దాదాపు 30 మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అడవుల సంరక్షణకు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రాణత్యాగం చేసిన అమరవీరులు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అన్నారు. సిబ్బంది వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అడవుల సంరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్‌అధికారి అప్పలకొండ, రెబ్బెన ఎఫ్ఆర్ఓ నిజాముద్దీన్, కార్యాలయ సిబ్బంది కీర్తిపాల్ పాల్గొన్నారు.

డెంగ్యూతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన గోలేటి మారుతి(42) డెంగ్యూతో ఆదివారం మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతికి నాలుగు రోజులుగా జ్వరం రావడంతో స్థానికంగా ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకోగా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఈజ్‌గాంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడకి భార్య శారద, ఒక కుమార్తె ఉన్నారు. మారుతి తెలంగాణ సాంస్కృతిక సారధిలో కళాకారుడిగా సేవలందిస్తున్నారు.

ఉద్యమకారుడికి నివాళులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుడిగా కళాజాత బృందంతో ప్రదర్శనలు, అగర్‌గూడ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా సేవలందించిన గోలేటి మారుతి ఆదివారం రాత్రి మరణించడంతో ఆయన భౌతికకాయానికి అగర్‌గూడ గ్రామంలో కోనేరు చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ నివాళ్లు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నిహాల్ ఖాన్

నవతెలంగాణ-దండేపల్లి



కాంగ్రెస్ మైనార్టీ సెల్ దండేపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా తాళ్లపేట్ గ్రామానికి చెందిన నీహల్ ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ సభ్యులు కాంగ్రెస్ వ్యూహాత్మక కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు నియామక పత్రం అందజేశారు. మండలంలోని మైనార్టీల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి అప్పగించిన ప్రేమ్ సాగర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖలీద్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు ఆకుల దుర్గాప్రసాద్, నాయకులు అనివేని తిరుపతి, రామన్న, జంగు, మల్లేష్, లింగారావు, రమేష్, చిట్ల రమణ పాల్గొన్నారు.

అక్టోబర్ 28న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు అక్టోబర్ 28న నిర్వహించడానికి కార్మిక సంఘాల ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం నిర్ణయించిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, సింగరేణి వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాలయంలో కార్మిక శాఖ అధికారుల సమక్షంలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు.

ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంతా పార్టీ రాష్ట్ర నాయకులు నందిరామయ్య, జిల్లా కార్యదర్శి జాడి జయరాజ్ అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో చింతగూడ గ్రామ నిరుపేదలతో మండల కేంద్రంలో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పాపమ్మగూడ శివారు సర్వే నెంబర్ 81/అలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి ఇండ్లు లేని నిరుపేదలకు అందించాలన్నారు. పట్టాలు ఇచ్చిన వారికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పురంశెట్టి బాపు, పీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమాదేవి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఉప్పులేటి సురేష్, బొమ్మనేని లక్ష్మణ్, షేక్ కరీమ్, గ్రామస్తులు దుర్గం మున్నయ్య, బాలసాని మల్లేష్‌గౌడ్, సట్ల సత్తన్న, జక్కుల చంద్రయ్య రజిత, రూప, నాగలక్ష్మి, విజయ, మాధవి, పావని, స్రవంతి పాల్గొన్నారు.

కాసిపేటలో ప్రజావాణి



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యలపై మొత్తం మూడు దరఖాస్తులు రాగా అధికారులు స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, ఎంపీఓ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక పాల్గొన్నారు.

వెల్మ సంక్షేమ సంఘం జన్నారం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

వెల్మ సంక్షేమ సంఘం మండలం కార్యవర్గాన్ని ఆ సంఘం నాయకులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అశోక్‌రావు, అధ్యక్షులుగా రామడుగు రమేష్ రావు, ఉపాధ్యక్షులుగా మాదాడి సరోజన, ప్రధాన కార్యదర్శిగా గుండవరపు మధుసూదన రావు, కోశాధికారిగా అంజితరావు, సంయుక్త కార్యదర్శిగా హనుమంత రావు, ముఖ్యసలహాదారులుగా యాదగిరి శేఖర్‌రావు, కమలాకర్ రావులున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు పదవి కాలంలో ఉంటుందన్నారు. వెల్మ హక్కుల కోసం పోరాటం చేస్తుందని నాయకులు తెలిపారు.

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

నవ తెలంగాణ-తాండూర్

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జీ ముఖేష్ అన్నారు. సోమవారం తాండూరు కస్తూర్బా గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా చట్టాలు, వినియోగదారుల ఫోరం, హిందూ వివాహ చట్టాలతో పాటు న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. న్యాయ సేవా సంస్థ పేదలకు నిరుపేదలకు ఉచిత న్యాయ సేవ సలహాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, కేజీబీవీకు 4 ఫ్యాన్లను విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంతోష్, మహిళా కార్యదర్శి నల్లుల సంగీత, స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శి సౌమ్య న్యాయవాదులు దుద్దిల్ల అశోక్, బాలకష్ణ అంకెం శివకుమార్, చేను రవికుమార్, దాట్ల సతీష్ పాల్గొన్నారు.

మహా మండప నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని 20వ వార్డులో రూ.50 లక్షలతో శ్రీ కోదండరామాలయ మహా మండప నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భూమి పూజ చేశారు. తన క్యాపు కార్యాలయంలో 76 జీఓ ఇంటి స్థలాల పట్టాలకు సంబంధించి రెవెన్యూ మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని గహప్రవేశాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, స్థానిక కౌన్సిలర్ గోసిక రమేష్, ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-తాండూర్



సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఆ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇంఛార్జి రేగుంట చంద్రశేకర్ ప్రారంభించారు. బెల్లంపల్లి బజార్ ఏరియాలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో వేల మంది ప్రాణ త్యాగాలు చేసి లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని తెలిపారు. భూస్వాములు, పెత్తంగారుల అరాచకాలకు వ్యతిరేకంగా నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి , మగ్దూం మొయినుద్దీన్, చాకలి ఐలమ్మ మల్లు స్వరాజ్యం లాంటి ఎంతోమంది కమ్యూనిస్టులు పోరాడారని తెలిపారు. వారి పోరాటాల ఫలితంగా నేడు నిరంకుశ పాలన, పెత్తనం దారి వ్యవస్థల నుంచి కొంతమేరకు విముక్తి కలిగిందన్నారు. ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ సాయుధ రైతంగా పోరాట వారోత్సవాలను జరుపుతామని, నేడు వారి త్యాగాలను విస్మరించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళీ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, రాష్ట్ర సమితి సభ్యురాలు పూర్ణిమ, జిల్లా సమితి సభ్యులు చంద్ర మాణిక్యం, అక్కెపెల్లిబాపు, వెల్తురు శంకర్, బొంతల లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కొంకుల రాజేష్, మేకల రాజేశం, రత్నం రాజం, గంగారం, రామ్చందర్, స్వామి దాస్, బండారు శంకర్, భరత్, శ్రీనివాస్, రామనాథ్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో 75వ తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు సాయుధ పోరాట వారోత్సవాల జెండాను సీపీఐ సీనియర్ నాయకులు దుర్గం పోశం ఎగర వేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతంగ పోరాటంలో 4500 వేల మంది ప్రాణ త్యాగాలు చేసి, లక్షల ఎకరాల భూమిని పంపిణి చేసిన కమ్యూనిస్టుల పోరాటం వృదా కాదని, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినుద్దీన్, చాకలి ఐలమ్మ మల్లు స్వరాజ్యం లాంటి ఎంతో మంది నిజాం నిరంకుశ పాలన, దొరల దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా పోరాడి మట్టి మనుషులను పోరాట శక్తులుగా తీర్చిదిద్దిన చరిత్ర తెలంగాణదన్నారు. ఉద్యమ సమయంలో వీరుల త్యాగాలను కొనియాడుతూ అదికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. నేటి తరాలకు చరిత్రను తెలియజేయకుండా కుట్రలు చేస్తున్నదని, ఇప్పటికైనా అధికారికంగా వారోత్సవాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జాడి పోషం, దాగం రాయలింగు, గోదారుల లింగమూర్తి, అంకులు, దుర్గం పోశం, లక్ష్మణ్, గట్టు సర్వేశం పాల్గొన్నారు.

నస్పూర్ : తెలంగాణ సాయుధ పోరాట అమరులను ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. సోమవారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 75వ వార్షికోత్సవాల సందర్భంగా నర్సయ్య భవన్‌లో జెండాను ఆవిష్కరించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట అమరులను మరిచిందని, ఉద్యమ సమయంలో సాయుధ పోరాట అమరులను కీర్తించి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించిందని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ పోరాట అమరులు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా ట్యాంక్ బండ్‌పై స్మారక చిత్రాలను పెడతానని నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సెప్టెంబర్11 నుండి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, దాసు, ముస్కె సమ్మయ్య, చిలుక రామచందర్, మోత్కూరి కొమురయ్య, శాఖపురం కిరణ్ కుమార్, మొగిలి లక్ష్మణ్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.





సబ్‌స్టేషన్ ఏర్పాటుతోనే అన్ని సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 132కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయిబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కత్తులపురి నాగేందర్, శేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో సామాజిక కార్యకర్త భూమా చారికి సోమవారం మద్దతు తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే మండల కేంద్రంలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు మద్రిపల్లి అంజన్న, వెంకటేష్, సత్తయ్య రాజేష్, రమేష్, గంగయ్య, శంకరయ్య నాగేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్ పట్ల పరిజ్ఞానం పెంచుకోవాలి



నవతెలంగాణ-భీమారం

నేటి ఆధునిక ప్రపంచంలో సైన్స్ విజ్ఞానం ప్రతి రంగంలో ముడిపడి ఉందని ఉందని జిల్లా స్థాయి విజ్ఞాన సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్‌లు అన్నారు. సోమవారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైన్స్ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ శరీరంలో అంతర్గత అవయవ ప్రయోగ పరికరాల ద్వారా శరీర అవయవాల పని విధానం, ఏఏ అవయవాలతో జరిగే క్రియా సమ్మేళన ప్రక్రియల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, పాఠశాల హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

పోరాటల ద్వారానే హక్కుల సాధన



నవతెలంగాణ-నస్పూర్

పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని మరో సారి రుజువైదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7, న్యూటెక్, ఆర్కే-5 గనులలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఎరియర్స్ మొత్తాన్ని రెండు దఫాలుగా చెల్లిస్తామని ప్రకటించిందన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ దానికి వ్యతిరేకంగా అన్ని గనుల మీద ధర్నాలు, జీఎం కార్యాలయాల ముట్టడి, రిలే నిరాహార దీక్షలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో యాజమాన్యం దిగివచ్చి ఈ నెల 21న ఎరియర్స్ డబ్బులు ఒకే దఫా చెల్లించుటకు అంగీకరించిందన్నారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియర్స్ మొత్తాన్ని ఒకే దఫా కాకుండా రెండు దఫాలుగా చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటిస్తే కనీసం వ్యతిరేకించలేదన్నారు. నాయకులు నేడు మేము మా అధినాయకత్వం వల్లనే ఏరియర్స్ ఒకే దఫా చెల్లింపులు జరుగుతున్నాయని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు అనుభవిస్తున్న ఏ హక్కు అయినా కార్మికుల ఐకమత్యంతో ఏఐటీయూసీ నాయకత్వంలో పోరాటాలు నిర్వహించడం వల్లే వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా కార్మికులంతా ఐక్యమత్యంతో పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్, గజ్జి రమేష్, బీరా రవీందర్, బడికెల ప్రతాప్, గునిగంటి నరసింగరావు, మారపల్లి బాపు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

డ్రైనేజీని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీని ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సోమవారం డ్రైనేజీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీటితో ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ భూమేష్ అధికారులకు తెలిపారు. త్వరలో ఈ సమస్యను పరిష్కరించి ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని ఆర్‌అండ్‌బి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహ చారి, డీఈ బావసింగ్, జేఈ సుధాకర్ ఉన్నారు.

రేచిని గ్రామస్తులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ ప్రజలకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రేచిని శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు జిల్లా ఉపాధ్యక్షులు పులుగం తిరుపతి, హరీష్ గౌడ్, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ సంతోష్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు కోడి రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేచిని గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అయితే రూ.15 లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తామన్న హామీని నెరవేర్చలేదని తెలిపారు. గ్రామ పంచాయతీలో రోడ్లు, త్రాగునీరు వంటి మౌలిక వసతులు హామీలు విస్మరించారని విమర్శించారు. 110 ఎకరాల ఆయకట్టు గల దొంగుల్ చెరువు మత్తడి నిర్మాణం చేపట్టాలని కోరారు. దొంగల చెరువు మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ఆయకట్టు రైతులు కూలీలుగా మారుతున్నారన్నారు. అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యేకు రేచిని గ్రామపంచాయతీలో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి విష్ణుకళ్యాణ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్, సీనియర్ నాయకులు శేషగిరి, మల్లేష్, రాహుల్ రేచిని పోలింగ్ బూత్ అధ్యక్షుడు అదే శ్రీనివాస్, మధుకర్, సోమయ్య, సాయి కిరణ్, గణేష్, అంజి, వాగయ్య, నాగరాజ్, సమయ్య పాల్గొన్నారు.

శివకేశవ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-భీమిని



మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శివకేశవ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అప్పాల శ్యామ్ ప్రణీత్ అవధాని ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ బోనగిరి ఓంప్రకాష్ గుప్తా దంపతులతో గణపతి పూజ, స్వస్తీ పుణ్యాహవచనం, కంకణ ధారణ భూమి పూజ తదితర క్రతువు జరిపించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సహకారంతో గ్రామంలో దాతలు, దేవాదాయశాఖ ద్వారా రూ.35 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమల భాయి, లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ లావణ్య, చెట్ల ప్రకాష్ గుప్తా, చెట్ల మహేందర్, దత్తు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5, ఆర్కే-6, సీహెచ్‌పీ గనులలో గైర్హాజరైన కార్మికులకు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఆధ్వర్యంలో సోమవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరవిందరావు మాట్లాడుతూ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలని, హాజరు కానట్లయితే కంపని తీసుకునే క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగులు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వారి రిపోర్టులను పరిశీలించి తగు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈరోజు జరిగిన కౌన్సిలింగ్‌కు 55 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, డీవై పీఎంలు రాజేశ్వర రావు, రాజేష్, సీనియర్ పీఓ ప్రకాష్, గని సంక్షేమ అధికారులు సునీల్, సీనియర్ అసిస్టెంట్లు మధునయ్య, ప్రసాద్, కళ్యాణి పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 12, 2023 | www.navatelangana.com

అమరులను స్మరిస్తూ త్యాగలను గుర్తించాలి

- డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అటవీ రక్షణలో ప్రాణాలను వదిలిన అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారిని గుర్తించాలని డీఎఫ్ఓ ప్రశాంత్ పాటిల్ అన్నారు. సోమవారం మావల మండలంలోని హరిత వనంలో అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వనంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల రక్షణయే ధ్యేయంగా సిబ్బంది పని చేస్తున్నారన్నారు. మూగజీవలు, వృక్షాల రక్షణ కోసం నిరంతం కృషి చేయాలని సూచించారు. అడవుల రక్షణ నేపథ్యంలో అమరులైన వారిని స్మరించుకుంటు విధుల్లో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్, రాష్ట్ర అటవీ ఉద్యోగుల సంఘ సభ్యులు బాణవత్ ప్రశాంత్, సభ్యులు గీరయ్య, ప్రవీణ్, అమర్ సింగ్, కృష్ణ, వేణు, కేశవ్, అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భరంపూర్ మండల ఏర్పాటు కోసం కృషి

నవతెలంగాణ-తలమడుగు



భరంపూర్ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేసేల తన వంతు కృషి చేస్తానని విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి అన్నారు. సాధన సమితి నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ విజయ డెయిరీ చైర్మెన్‌ను కలిసి కొత్త మండలం ఏర్పాటు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక భూమ రెడ్డి మాట్లాడుతూ ఇది వరకే ముఖ్యమంత్రితో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్నతో కలిసి విన్నవించడం జరిగిందన్నారు. మరోసారి కలిసి ఈ విషయాన్ని విన్నవిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు బొల్లారపు బాబన్న, కేదారిశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మాందా లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, ఎంపీటీసీ రమేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, స్వామి, సుదర్శన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సాగర్ గౌడ్, ఎడ్ల ఆశన్న, రమాకాంత్ పాల్గొన్నారు.

మెడ కోసుకొని రోగి హల్‌చల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగి సోమవారం మెడ కోసుకున్నాడు. మేల్ మెడికల్ వార్డులో చికిత్స పొందుతున్న ఇంద్రవెల్లికి చెందిన షిండే బాలాజీ(35) మధ్యాహ్నం మరుగుదొడ్డిలోకి వెళ్లి మెడకు కాటు పెట్టుకున్నాడు. అనంతరం పడక పైకి వచ్చి నిలబడి సెలైన్ బాటిళ్ల స్టాండ్లు పట్టుకొని భయానక వాతావరణం సృష్టించాడు. దీంతో రోగులు ఉరుకులు పురుగులు పెట్టారు. ఒక్కసారిగా అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. భద్రతా సిబ్బంది రోగిని ఎలాగోలా పట్టుకొని తాళ్లతో కట్టేసి చికిత్స అందించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

షీ టీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన

నవతెలంగాణ - రెబ్బెన

తుంగెడ గ్రామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ బాలికలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిలో వ్యక్తిగత ఫొటోలు, సమాచారం ఉంచొద్దని, ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ద్వారా మోసగాళ్లు వ్యక్తిగత సమాచారం సేకరించి ఫొటోలు మార్ఫింగ్ చేసి బాలికలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నందున ఎవరు కూడా వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా వెబ్‌సైట్‌లో ఉంచకూడదన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా తెలియజేశారు. ఇందులో భాగంగా హ్యూమన్ ట్రాఫికింగ్(మనుషుల అక్రమ రవాణా), చట్ట వ్యతిరేకంగా దత్తత తీసుకోవడం, బాల్య వివాహాలు, ఆపత్కాల సమయాల్లో పోలీసు వారి సహాయం పొందడానికి డయల్ వంద విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ, షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు కోచింగ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగాలకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. జలగం అనిత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలు సాధారణ అంశాలైన జనరల్ ఇంగ్లీష్, అప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై వివిధ అంశాలలో నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ.ప్రభాత్ రావు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ కే.చంద్రకాంత్, ఎస్‌కే. ముజీబ్, ఎం.నరేష్ పాల్గొన్నారు.

అనిల్ జాదవ్‌ను కలిసిన దేవాపూర్ వాసులు

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను మండలంలోని దేవాపూర్ గ్రామస్థులు కలిశారు. సోమవారం యూత్ సభ్యులు, గ్రామస్తులు, మండల నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ త్రయంబక్, రమాకాంత్, అనిల్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. టీకెట్‌రావడం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

15న మహాత్మా గాంధీపై ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 15న నెహ్రూ యువ కేంద్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో "మహాత్మా గాంధీ జీవన విధానము, వారి ఆలోచనలు" అనే అంశంపైన ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి సుశీల్ భడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు ఉదయం10 గంటలకు ప్రారంభమవుతాయని, పోటీకి మూడు నిమిషాల సమయం ఉంటుందని, ఆసక్తి కలిగిన యువతీయువకులు వారి పేర్లను నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో నమోదు నమోదు చేసుకోవాలని అన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారిని జాతీయస్థాయి పార్లమెంటు హాల్లో జరుగు పోటీలకు నెహ్రూ యువ కేంద్రం ద్వారా పంపుతామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న ఉపాధ్యాయులు సమాజంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూధన్, అడెల్లి పోచమ్మ ఆలయ చైర్మెన్ అయిటి చందు, సొసైటీ చైర్మెన్ మానిక్ రెడ్డి, ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేల : మండలంలోని సాంగిడి గ్రామంలోని ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సోమవారం సన్మానించారు. సాంగిడి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నార్లావార్ సంతోష్, గోకుల్‌లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందారు. వారిని ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం నాగారెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు అశోక్‌రెడ్డి, పారట్కర్ విజయ్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని కదిలి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుని అందుకున్నారు. గ్రామంలోని ఉపసర్పంచ్ మారుతి పటేల్ పాఠశాల ఆవరణలో సోమవారం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ చిన్న గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయునికి అవార్డు రావడం మాకెంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శోభారాణి, గ్రామ ప్రజలు సాయినాథ్, బంటు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు బాధ్యతలు అప్పగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏడు శాతం లేని అగ్రకులాలు ఏడు పార్టీలకు అధినాయకత్వంగా ఉన్నాయని, ఆ పార్టీల నాయకత్వాన్ని అణగారిన కులాలకు అప్పగించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ధర్మ సమాజ్ పార్టీ, తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణచౌక్‌లో అగ్రకుల పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సీ ప్రజల్ని ఓటు బ్యాంకుగా వాడుకోవడం, వారికి మందు బిర్యానీలు పంచి పెట్టడం, బహిరంగ సభలకు తరలిస్తున్నారని అన్నారు. ఇందులో డీఎస్పీ నాయకులు బరుకుంటి రాజీవ్, బండారి సంతోష్, తొంటికోరి సంతోష్, కరాడి గంగన్న, ఎల్మల మంజుష, ఏనుగు శ్యామల, సుష్మ, శ్రీవాణి, దర్శనాల అశోక్, బడుగు రాజేశ్వర్, లక్ష్మణ్, కొండమడుగు గణేష్, నరేష్, సంగర్తి రామచందర్, అగ్గిమల్ల నవీన్, తిరుపతి, సురేష్, రఘు, జగదీష్, రమేష్, విను కుమార్ పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు

- తాళాలు పగులకొట్టి మరీ నిర్వహణకు ప్రయత్నించిన అధికారులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎవరైనా సమ్మెకు దిగితే వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి. కాని సోమవారం నుండి సమ్మెకు దిగిన అంగన్‌వాడీల సమస్యలు తెలుసుకోవడం పక్కన పెడితే వారి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి మరీ తాళాలు పగులకొట్టి వాటి నిర్వహణ చేపట్టే ప్రయత్నం చేశారు అధికారులు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా వారు రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జేఏసీగా ఏర్పడి ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుండి జేఏసీ రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ కేంద్రాలకు తాళాలు వేసి వచ్చి సమ్మె చేపడుతున్నారు. వీరి సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నంలో భాగంగా అధికారులు కేంద్రాల తాళాలు పగులకొట్టడం ఇక్కడ గమనార్హం. ఐసీడీఎస్ ఆర్‌జేడీ ఝాన్సీ ఆధ్వర్యంలో పీడీ సావిత్రి, సీడీపీఓ సురేఖ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మిలు పలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి వాటి తాళాలను మెప్మా సిబ్బంది సహాయంతో పగులకొట్టించారు. మెప్మా సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రయత్నం చేసినా మెప్మా సిబ్బంది కూడా సహకరించకపోవడంతో ఉన్న సిబ్బందితో కేంద్రాలకు వచ్చిన పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రయత్నించారు.

సమ్మె విచ్ఛిన్నంలో భాగమే : ఆర్.త్రివేణి

సమ్మె శిబిరం వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్ త్రివేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి వాటి నిర్వహణకు ప్రయత్నించడం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకేనని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొన్ని నెలలుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించడం సరికాదని అన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ సమక్షంలో ఆగష్టు 18న జరిపిన చర్చలు సానుకూలంగానే జరిగినా తర్వాత ప్రభుత్వం పట్టించుకోని కారణంగానే సమ్మెకు దిగాల్సి వచ్చిందని అన్నారు. ఈ సమ్మెలో కాగజ్‌నగర్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం వినోద, వై అరుణతో పాటు పట్టణం, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉమాదేవి, మండల అధ్యక్షురాలు ఎస్ అర్చన అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి విమల, సరస్వతి, జ్యోతి, సంధ్య పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన : సమస్యలు పరిష్కరించాలని సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ చేసి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు, అంగన్‌వాడీలు రాజేశ్వరి, తిరుపతమ్మ, బాలమ్మ చంద్రకళ, ప్రమీల, స్వర్ణలత, మంజుల, శ్రీవాణి, ఇందిరా, పద్మ, సంతోష్ పాల్గొన్నారు.

జన్నారం : అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సరస్వతి, సీఐటీయూ మండల కార్యదర్శి నరసింహ వేగ అన్నారు. సమస్యల పరిష్కరం కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికే సమ్మె నోటీసు ప్రభుత్వానికి ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. సమ్మెకు వెళ్తే కేంద్రాలకు తాళాలు వేసి గ్రామపంచాయతీలో ఇచ్చి వెళ్లాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాజేశ్వరి, కృప, లక్ష్మీ, జమున, స్వర్ణలతా, సరస్వతి, రజిత, రమాదేవి, విజయలక్ష్మి, సురేఖ, కృష్ణవేణి, భాగ్యమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

కాసిపేట : అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంలో కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రాడ్యూటి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ పెంపు ఇతర సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్, ఏఐటీయూసీ నాయకులు జాడి పోచం, గట్టు సర్వేశం, దాగం రాజలింగు, అంకులు, జేఏసీ నాయకులు లోజ్ మురళి, దాసరి రాజయ్యలు సంఘీభావం తెలిపారు.

తాండూర్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీలు సోమవారం సమ్మెలో భాగంగా మొదటి రోజు తహసీల్దార్ కార్యాలలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో 120 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు లీలావతి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన అంగన్‌వాడీలు పనిచేస్తున్నారని తెలిపారు. గత 45 సంవత్సరాలుగా స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న వారికి కనీస వేతనం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

భీమిని : అంగన్‌వాడీలనున్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మెలో ఉండగా పంచాయతీ కార్యదర్శులకు కేంద్రాల తాళాలు పగుల గొట్టి కేంద్రాలను ఎవరి ఆదేశాల మేరకు ఓపెన్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో విలువైన వస్తువులకు బాధ్యులు ఎవరని తక్షణమే కేంద్రాలను ముయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని అన్నారు.

చింతలమానేపల్లి : సమస్యల పరిష్కరం కోసం అంగన్‌వాడీలు సోమవారం నుంచి నిరావధిక సమ్మె చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ముందు బయిటయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

తలమడుగు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కళావతి, ఉపాధ్యక్షురాలు అనసూయ, సహాయక కార్యదర్శి మంజుల, మండల నాయకురాలు రమణ, రాధా, అనసూయ, జ్యోతి, శోభారాణి పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాసర : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మద్దతు పలికారు. సమ్మెలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి, జిల్లా కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాళు విజయ, రజియా, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ప్రేమలత, లక్ష్మీ, ద్రౌపతి, ఆయాలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. తిర్యాని మండలంలోని ఆదివాసి భవనంలో నిర్వహించిన మొదటి మహాసభకు జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్య, విద్యా ఉపాధి వైద్యం రోడ్లు రవాణా, తాగునీటి సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో రోజురోజుకూ నిరుద్యోగం పెరుగుతోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. తిర్యాని మండలంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. భవిష్యత్తులో రోడ్డు, తాగునీటి సమస్యలపై పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 11 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తాళ్లపల్లి రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా బాబురావు, లక్ష్మి, మధుకర్, మండల కార్యదర్శిగా దుర్గం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిలు పార్శు, టీకానంద్, కమిటీ సభ్యులుగా పవన్, రంజిత్, రోహిత్, నగేష్‌ను ఎన్నుకున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకులు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్‌హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం ఎనిమిదవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్దనుండి కలెక్టరేట్ గేట్ ఎదుట నిరసన చేశారు. రెగ్యులర్ చేయాలంటూ నినందించారు. ఈ సందర్భంగా యుపీహెచ్‌సీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ దేశ్ పాండే మాట్లాడుతూ ప్రభుత్వ పీఆర్‌సీ ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వారం రోజుల నుండి సమ్మె చేపడుతున్న ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్స్‌లోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు విజయ్, నీల, స్రవంతి, విష్ణు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఎస్పీ అధ్యక్షతన హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, సనాతన హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర హిందూ బంధువులు, మండప నిర్వహకులు, ప్రజాప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలందరూ సహకరించినప్పుడే జిల్లా ప్రశాంత వాతావరణంలో అన్ని పండుగలను అన్ని మతాలకు, కులాలకు అనుగుణంగా, సామరస్యతతో విజయవంతంగా నిర్వహించవచ్చునని తెలిపారు. మంచి సమాజం నిర్మాణం కోసం ప్రజలందరూ ప్రశాంతంగా వారి వారి పండుగలను నిర్వహిస్తూ ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణాన్ని 10 సెక్టార్లుగా విభజించి సెక్టార్‌కి ఒక ఎస్సై అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించి ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. గణపతి నిర్వహణ కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటిస్తూ, ప్రమాదాలను నివారిస్తూ, వచ్చిన మహిళ సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ గణపతి నవరాత్రి ఉత్సవాలలో పోలీసు వ్యవస్థ అన్ని రకాల బందోబస్తు చర్యలను తీసుకుంటుందని ప్రత్యేకంగా మహిళా సిబ్బంది ద్వారా మహిళా సందర్శకులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇతరులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తమ మండపాలను, పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రతి గణపతి మండపం నిర్వాహకులు ఆన్‌లైన్ చేసుకోవాలని అన్నారు. మండప కమిటీ సభ్యులు, నిమజ్జనం, తేదీ, ప్రదేశం, సహాయకులు తదితర వివరాలను తప్పకుండా పొందుపరచాలని తెలియజేశారు. రాత్రి సమయాల్లో గణపతి మండపాల వద్ద కమిటీ సభ్యులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక శబ్దాన్ని సృష్టించే డీజేలను ఎక్కువ మోతాదులో పెట్టడం ప్రజల ఆరోగ్యానికి హానికరం వాటికి అనుమతి లేదని సూచించారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ఆదిలాబాద్ పట్టణ ప్రజాప్రతినిధులు, అదిలాబాద్ డీఎస్పీ వి.ఉమేందర్ పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్‌లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని అర్జీలను స్వీకరించారు. భూ సంబంధ, గృహలక్ష్మి, ఆసరా ఫించన్, ఉపాధి కల్పన, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు వంటి సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులకు నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

మిస్టర్ క్లాసిక్ ఇండియా అవార్డుకు పొందిన నేరడిగొండవాసి

నవతెలంగాణ-నేరడిగొండ

నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన రాజేశ్వర్-వనజ దంపతుల కుమారుడు మధుల్కర్ వినయ్ రాజు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరుమల్లు సినిమాలో వినయ్ రాజ్ విలన్ గ్రూప్‌లో నటించాడు. పరకాల సినిమాలో సైతం సైడ్ హీరోగా పాత్ర పోషించారు. తండ్రి వత్తిరీత్యా టైలర్ కాగా, తల్లి డ్వాక్రా గ్రూప్ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్నారు. పేద కుటుంబం అయినప్పటికీ తన కుమారుడు కన్నకలను సహకారం చేసుకునేందుకు తోడ్పాటును అందించారు. ఆయన అభిరుచికి అనుగుణంగా ప్రోత్సహం అందించారు. దీంతో మిస్టర్ ఇండియాగా ఎంపిక కావాలనే తన పదేళ్ల నాటి కల సాకరమైనదిని అన్నారు. ఆగస్టు 27న హైదరాబాదులో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో రాణించి అవార్డు అందుకున్నట్టు ఆయన వివరించారు. మిస్టర్ ఇండియా ఆడిషన్‌లో 650 మంది యువకులు పోటీ పడగా అందులో 30 మంది ఎంపికయ్యారని అందులో తాను కూడా ఉన్నట్లు తెలియజేశారు. వినయ్ నేరడిగొండ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి పూర్తి చేసి, డయాలసిస్ డిప్లమో కోర్సును హైదరాబాదులో పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కోరుట్ల ఆస్పత్రిలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో హైదరాబాద్ వెళ్లి మోడలింగ్‌తో పాటు సినిమాల్లో రాణించేందుకు ప్రయత్నాలు సాగించి సక్సెస్ అయ్యారన్నారు.

పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మార్చాలి

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మార్చాలని నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో 30 పడకల గదులున్నాయి. ఈ ఆస్పత్రిని పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న పాల్గొన్నారు.

రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పంటలకు చీడపీడలు రాకుండా రైతులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ గణేష్ సూచించారు. సోమవారం ఆయన ఏఈఓలతో ఆయన మండలంలోని చాందూరి గ్రామంలోని రైతుల పత్తి పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పత్తి పంట 80 రోజుల దశలో ఉన్నందున నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌లను మొక్క మొదళ్లకు కొద్దీ దూరంలో వేయాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పత్తిలో ఆకుమచ్చ, కాయ కుళ్ల తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత ముందస్తు చర్యగా స్ట్రెప్టో సైక్లిన్, కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని లేదా ప్రోపికోనజోల్ 1 మీ.లీ. లేదా హెక్సాకోనజోల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే ఏఈఓలను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఏఈఓ వినయ్ కుమార్, రైతులు గణేష్ , దొండిరామ్ ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం ప్రారంభించిన అనిల్ జాదవ్

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో నేచర్‌కేర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని సోమవారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే రైతులకు నాణ్యమైన మందులు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్, పాండురంగ్, సాబ్లే నానక్ సింగ్, దేవేందర్‌రెడ్డి, నార్వడే రమేష్, అబ్దుల్ సాబిర్, కరీం, అజీమ్, ఇమ్రాన్, భీంరావ్, కమలాకర్‌రెడ్డి, కలీమ్ పాల్గొన్నారు.